ఏమిటీ చెత్త సమస్య..?

- శాశ్వత డంపింగ్ యార్డు లేక ఇక్కట్లు
- తాత్కాలికం పేరిట చెరువుల్లో పడేస్తున్న వ్యర్థాలు
- విమర్శలు వినిపిస్తున్నా కొలిక్కిరాని పరిష్కార మార్గాలు
- రూపు కోల్పోతున్న నీటి వనరులు
- చోద్యం చూస్తున్న అధికారులు



నగర పంచాయతీ వీధి కూడళ్ల వద్ద రోజుల తరబడి పేరుకుపోయిన వ్యర్థాలు

పాలకొండ రూరల్: పండగైనా, పబ్బమైనా పట్టణ ప్రజలు పారిశుధ్య లోపాలతో సావాసం చేయక తప్పడం లేదు. పాలకొండ నగర పంచాయతీగా రూపాంతరం చెంది దాదాపు పుష్కరకాలం కావొస్తున్నా మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సమకూర లేదు. ముఖ్యంగా శాశ్వత ప్రాతిపదికన డంపింగ్ యార్డు రూపుదిద్దుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ పనులకు శ్రీకారం చుడితే 'నాడు' ప్రతిపక్ష టీడీపీ నాయకత్వం మోకాలొడ్డింది. 'నేడు' కూటమి అధికారంలో ఉన్నప్పటికీ ఈ పనులకు అడుగులు ముందుకు పడడం లేదు. పలు చోట్ల స్థలాలు గుర్తిస్తున్నా నిర్మాణ పనులు మాత్రం చేపట్టడం లేదు. తీంతో ఎక్కడికక్కడే తాత్కాలికం పేరిట చేరువుల్లో, ఖాళీ ప్రదేశాల్లో చెత్త, వ్యర్థాలను వేస్తుండడంతో ఆయా ప్రాంతాలకు సమీపంలో ఉంటున్న ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. త్వరలో పాలకొండలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు దేశ, విదేశాలల్లో ఉన్న స్థానికులు, బంధువులు వస్తారు. అయినప్పటికీ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగానే ఉంది.

చెత్త వేసేందుకు చెరువులపై దష్టి....

పట్టణ పరిధిలో శాశ్వత డంపింగ్ యార్డు లేకపోవడంతో సిబ్బంది తాత్కాలికంగా చెరువుల్లో చెత్తను డంప్ చేస్తున్నారు. ఈ క్రమంలో మొదట కొత్తవీధి సమీపంలో ఉన్న తెలకలవాని కోనేరు, బంగారమ్మ కోనేరు, వెంకటరాయుని కోనేరు పరిసరాలతో పాటు వీరఘట్టం రహదారిలో ఉన్న రాయడుకోనేటి సమీపంలో చెత్తను డంపింగ్ చేశారు. అలాగే అక్కడే ఉన్న ఓనిగెడ్డ వద్ద కూడా చెత్త వేయడంతో కోనేరులు తమ వాస్తవ రూపు కోల్పోయాయి. ఇదిలా ఉంటే చెరువుల్లో చెత్త వేయడం వల్ల నీరు కలుషితమవుతోందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓనిగెడ్డ పరిసర ప్రాంత రైతులు ఇటీవల కాలంలో ఆందోళన చేపట్టడంతో శ్రీకాకుళం, సీతంపేట రహదారుల పక్కన కొద్ది రోజులు చెత్త వేశారు. తాజాగా పాలకొండ అర్బన్‌కు సంబంధించిన జగనన్న కాలనీ సమీపంలో, ఓని గ్రామానికి వెళ్లే మార్గంలో గల బత్తులవాని చెరువు పరిసరాల్లో చెత్త డంపింగ్ చేస్తున్నారు. దీంతో దుర్వాసన, ఈగలు, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని సమీప ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తిరస్కరణలు..

గతంలో మండల పరిధిలోని సిరికొండ, అట్టలి, టీడీ పారాపురం, మల్లమ్మగూడ, తదితర గ్రామాల శివారుల్లో స్థలాలు గుర్తించినప్పటికి అక్కడి ప్రజలు డంపింగ్‌యార్డుల ఏర్పాటును వ్యతిరేకించారు. అలాగే చెరువుల్లో చెత్త వేయొద్దని జలవనరుల శాఖ అధికారులు నగర పంచాయతీకి లేఖలు అందించడంతో అధికారులు చెత్త సమస్యను ఎలా అధిగమించాలా అని పునరాలోచనలో పడ్డారు.

సహజ వనరులు కలుషితం..



తాత్కాలిక డంపింగ్ యార్డు పేరిట నగర పంచాయతీ అధికారులు సహజ వనరులైన సాగు నీటి చెరువులను కలుషితం చేస్తున్నారు. గతంలో ఇరిగేషన్ అధికారులకు ఈ సమస్య వివరించాం. ఫలితం లేదు. మా గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న బత్తులవాని చెరువును పూర్తిగా కప్పేశారు. ఇప్పుడు రోడ్డుపై వేస్తున్నారు. మా ఆరోగ్య భద్రతకు ఎవరు భరోసా. పక్కనే జగనన్న కాలనీ ఉంది. వర్షం కురిసినా, చిన్నపాటి గాలి వీచినా దుర్వాసన, పాములు, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. ఎప్పటికప్పుడు చెత్త తగులబెడుతుండటంతో దట్టమైనా పొగ వల్ల శ్వాస, నేత్ర సంబంధిత సమస్యలు వస్తున్నాయి.

– కనపాక సూర్యప్రకాష్, వైస్ ఎంపీపీ, పాలకొండ మండలం



చెత్తలు వేయడంతో పూడుకుపోయిన బంగారు కోనేరు



జగన్న కాలనీ, ఓని రోడ్డులో బత్తుల వాని చెరువు సమీపంలో చెత్త

క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకానున్న ఎమ్మెల్సీ

వీరఘట్టం: ఇటీవల పాలకొండలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను రానీయకుండా అధికార బలంతో కూటమి నాయకులు అడ్డుకున్నారు. దీనికి అధికార యంత్రాంగం కూడా వత్తాసు పలుకుతూ సభ నుంచి వెళ్లిపోవాలని ఎమ్మెల్సీ విక్రాంత్‌ను కోరారు. నాడు ఎవరేతే సమావేశం నుంచి వెళ్లిపోమన్నారో వారే మంగళవారం పాలకొండలో జరగనున్న సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని ఎమ్మెల్సీ విక్రాంత్‌కు ఆహ్వానం పంపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయనున్న నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సీతంపేట: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బిబి మిశ్రో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

పుస్తకాల పంపిణీ

సీతంపేట: సవర భాషా వలంటీర్లకు ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ చేతుల మీదుగా సవర భాషా పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. పుస్తకాలను వినియోగించుకుని విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధించాలని పీఓ సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

బత్తిలి విద్యార్థినికి స్కాలర్‌షిప్



సంజన

భామిని: మండలంలోని బత్తిలి జెడ్పీహెచ్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న గాగోలు సంజన యూనివర్సల్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం సన్యాసిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ కింద డిగ్రీ వరకు నెలకు వెయ్యిరూపాయలు ఇస్తారని పేర్కొన్నారు. బాడంగికి చెందిన వసుదైక కుటుంబం యూనివర్సిల్ ఫ్యామిలీ ఫౌండేషన్ తల్లిదండ్రులు లేని విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరుచేస్తూ ఆదుకుంటోందన్నారు.

విద్యార్థులకు అభినందనలు

కొమరాడ: విజయనగరం జిల్లా, నెల్లిమర్ల డైట్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన కళా ఉత్సవ్‌లో భాగంగా చేపట్టిన జానపద నృత్య ప్రదర్శన, చిత్రలేఖనం పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన స్థానిక గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు సోమవారం అభినందించారు. ప్రశంసలు పొందిన వారిలో విద్యార్థులు మండంగి సంతోష్, హర్షవర్ధన్, పి.వరుణ్‌సందేశ్, ఆరిక వినోద్, యశ్వంత్‌లు ఉన్నారు.

బెంబేలెత్తించిన గిరి నాగు

భామిని: మండలంలోని బత్తిలిలో పదడుగుల గిరినాగు సోమవారం ఉదయం స్థానికులను బెంబేలెత్తించింది. సవరవీధి శివారులో గిరినాగును చూసి స్థానికులు పరుగులుతీశారు. కొద్ది సేపటికి స్థానిక యువకులు ధైర్యం చేసి పామును పట్టుకుని దూరంగా విడిచిపెట్టారు.

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ నాయకులతో సినీ నటుడు నారాయణమూర్తి

పాలకొండ రూరల్: ప్రముఖ చలనచిత్ర నటుడు, నిర్మాత ఆర్. నారాయణమూర్తి పాలకొండ వైఎస్సార్‌సీపీ నాయకులను సోమవారం కలిశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్వగృహంలో జరిగిన ఈ కలయికలో ఆయన మాట్లాడుతూ.. విప్లవ భావాలతో నిర్మిస్తున్న తన చిత్రాలను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెలమల మన్మధరావు, లక్ష్మణరావు, విజయ్‌కుమార్, మోహన్‌రావు, శంకరరావు, వెంకటరమణ, భాను, పాపినాయుడు, కాంతారావు, ధవళేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

వీరఘట్టం: సిబ్బంది సమస్యల పరిష్కారంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నాయని విద్యుత్ శాఖ ఉద్యోగులు ఆరోపించారు. ఈ మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం విధులకు హాజరయ్యారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సింహాచలం, సురేష్, పవన్, కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నా

పాలకొండ: కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఉపాధ్యాయులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు వాసుదేవరావు, గోగు సూర్యనారాయణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు బీవీ రమణ, ధనంజయరావు, గౌరీశ్వరరావు, పి. శ్రీరాములు పాల్గొన్నారు.

నీలకంఠాపురాన్ని ప్రత్యేక మండలం చేయాలి



కురుపాం మండలంలోని నీలకంఠాపురాన్ని ప్రత్యేక మండలంగా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే, గిరిజన సంఘం నాయకుడు నిమ్మక జయరాజు, మాజీ ఎంపీపీ హిమరిక నీలకంఠేశ్వర రావు, సర్పంచ్ మన్మధరావు, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై నీలకంఠాపురం పంచాయతీ కేంద్రంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. మండల వ్యాప్తంగా 23 పంచాయతీలు ఉండగా, తూర్పుముఠా వైపు అత్యధికంగా ఉన్న 13 పంచాయతీలు నీలకంఠాపురం వైపు ఉన్నాయని, ఈ నేపథ్యంలో ప్రత్యేక మండలంగా నీలకంఠాపురాన్ని చేస్తే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ప్రత్యేక మండలం ప్రకటించేంత వరకు ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. -కురుపాం

అంతర పంటల సాగు పరిశీలన



చింతలపాడులో పండిస్తున్న చోడిపంటను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్ రెడ్డి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ, బుడ్డెమ్మఖర్జ గ్రామంలో రైతులు పేకాపు భాగ్యలక్ష్మి, రామారావులు తమ భూమిలో సాగు చేస్తున్న అంతర పంటలను నాబార్డు డీడీఎం దినేష్ కుమార్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రతి రైతు తాము పండిస్తున్న పంట ద్వారానే మళ్లీ వేసే పంటకు విత్తనాలు సమకూర్చుకుంటే నాణ్యమైన విత్తనాలు లభించినట్టు అవుతుందన్నారు. అక్కడి నుంచి చింతలపాడు గ్రామం వెళ్లి, మహిళా రైతు పూర్ణమ్మ తన జీడితోటలో సాగు చేస్తున్న బెండ, వంగ, కంది, రాగులు వంటి అంతర పంటలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట జీవా ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.ప్రబోధ్ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి



శ్మశానవాటికకు స్థలం ఇవ్వాలని కోరుతున్న చింతలబెలగాం దళితులు

జియ్యమ్మవలస రూరల్: శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని మండలంలోని చింతలబెలగాం గ్రామ దళితులు కోరుతున్నారు. గ్రామంలో సరిపడ శ్మశానవాటిక లేకపోవడంతో చనిపోయిన వారి అంత్యక్రియలు చేసేందుకు అవస్థలు పడుతున్నామన్నారు. ఇదివరకు సర్వే నంబరు 46లోని రెండు ఎకరాలకు పైగా గుడి చెరువు ఉండేదని, అది ఇప్పుడు పూర్తిగా అక్రమణకు గురైందన్నారు. ప్రస్తుతం మిగిలిన 60 సెంట్ల భూమిలో కేవలం సెంటున్నర మాత్రమే దళితులకు సంబంధించిన శ్మశానవాటికగా వాడుతున్నామని, అది సరిపోవడం లేదని కొత్తగా స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై జియ్యమ్మవలస తహసీల్దార్, పాలకొండ సబ్‌కలెక్టర్‌లకు అర్జీలు పెట్టామని, ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 200 మంది క్రీడాకారులు



జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారుల కెప్టెన్లతో వ్యాయామ ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఎంపిక క్రీడలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఈ క్రీడలను ప్రారంభించారు. క్రీడా పర్యవేక్షకుడు వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ జిల్లా ముఖ్య నాయకులు ఎం. రామకృష్ణ, ఎం. వాసుదేవరావు, , ఎ.సోంబాబు, తదితరుల నేతృత్వంలో ఏడు విభాగాలకు సంబంధించి పోటీలు నిర్వహించారు. ఇందులో 200 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరందరూ శ్రీకాకుళంలో ఈ నెల 18న జరగనున్న పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని క్రీడా పర్యవేక్షకుడు ఎన్. వెంకటరమణ తెలిపారు.

డ్రోన్లతో రసాయనాల పిచికారీ

వీరఘట్టం: డ్రోన్ల వినియోగంతో వ్యవసాయంలో నూతన విప్లవం ప్రారంభమైందని మండల వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య అన్నారు. మండలంలోని చలివేంద్రి గ్రామంలో కందల రామకృష్ణ, కోడూరి శంకరరావు, నెల్లి రామారావు పొలాలలో డ్రోన్ ద్వారా దశపర్ణి కషాయాన్ని సోమవారం పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న మురిడిబంద గెడ్డ



కొమరాడ మండలంలోని మురిడిబంద గెడ్డ పొంగిపొర్లుతోంది. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి గెడ్డ రోడ్డు పైనుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఇరువైపుల నుంచి ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. గిరిశిఖర గ్రామాలైన గొర్లిమ్మ, గూనకల్లు, కుంతేస్ ప్రాంతాల ప్రజలు నిత్యావసర సరుకుల కోసం, అటవీ ఉత్పత్తుల విక్రయం కోసం ప్రతి సోమవారం ఒడిశాలోని సోరిపిల్లిలో జరిగే సంతకు వెళ్లాలంటే ఇదే గెడ్డను దాటుకుని వెళ్లాలి. అయితే నీరు ఎంత మాత్రం తగ్గకపోవడంతో వారు సంతకు వెళ్లలేకపోయారు. నిత్యావసర సరుకులు లేక పస్తులతో పూట గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని, గెడ్డపై వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. -కొమరాడ

డొనేషన్ బాక్సుల ఏర్పాటు

కురుపాం: మండల కేంద్రంలోని రావాడ కూడలిలో ఉన్న పలు షాపుల్లో వాయుపుత్ర సేవా సంఘం వారు డొనేషన్ బాక్సులు సోమవారం ఏర్పాటు చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేశామని, వీటి ద్వారా వచ్చే ఆదాయంతో కురుపాం సహా పరిసర గ్రామాల ప్రజలకు సేవ చేసేందుకు ఉపయోగిస్తామని సంఘ నిర్వాహకులు బోటు అనిల్‌కుమార్, గుడ్ల సాగర్, ఎస్.లక్ష్మణ్, మణికంఠ, చంద్రమౌళి తెలిపారు.

'రణభేరి'ని విజయవంతం చేయండి

వీరఘట్టం: ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ చేపడుతున్న రణభేరి కార్యక్రమం మంగళవారం ఉదయం 8 గంటలకు సీతంపేటలో ప్రారంభమవుతుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రణభేరి ప్రచార బైక్‌జాతా సీతంపేటలో ప్రారంభమై నీలకంఠాపురం, కురుపాం, పార్వతీపురం మీదుగా సాలూరు చేరుకుంటుందన్నారు. ఆఫీస్ బేరర్స్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శక్తియాప్ వినియోగంపై అవగాహన

కురుపాం: మహిళల భద్రత కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన శక్తియాప్ వినియోగంపై మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 2, విజ్ఞాన భారతి స్కూల్‌లోని విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎవరైనా ఆపద సమయంలో ఈ యాప్‌ను ఆశ్రయిస్తే పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారని ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు ఏ సమస్య పైన అయినా ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబరు 112, ఫోన్ నంబరు 7993485111లను సంప్రదించవచ్చన్నారు.

పూరిపాక దగ్ధం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఊయక బలరాం పూరిపాక దగ్ధమైంది. ఎప్పటిలాగే పొలం వద్ద ఉన్న పాకకు రాత్రి తాళం వేసి, గ్రామంలోని ఇంటికి వచ్చేశామని, సోమవారం ఉదయం వెళ్లి చూసేసరికి పాక కాలిపోయి ఉందని బాధితుడు తెలిపాడు. ఇంటి వద్ద కన్నా పొలం వద్ద పాకలోనే ఎక్కువగా ఉంటామని, అందులోని నిత్యావసర సరుకులు, సామగ్రి అంతా కాలిపోయిందని వాపోయాడు. అధికారులు స్పందించి, నష్ట పరిహారం వచ్చేలా చూడాలని కోరాడు.

70 మంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న పీఓ, తదితరులు

సీతంపేట: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 70 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం లభించక గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తంనిల్వలు పెంచుకోవడానికే శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా రెవెన్యూ సేవలు



కంప్యూటర్ సేవలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

పాలకొండ: ప్రజలకు రెవెన్యూ సర్వీసులు సక్రమంగా అందించాలని సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. ఆర్ఐ, టీడీ, కంప్యూటర్ గదులను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమై, ప్రజలు అందించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సీతంపేట: డివిజన్ కేంద్రమైన పాలకొండలో సోమవారం జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల్లో స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం చంద్రరావు తెలిపారు. వాలీబాల్, ఖోకో పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను డిప్యూటీ వార్డెన్ గాసయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీశ్వరరావు, తదితరులతో కలిసి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు టోలార్మి



ఎంపికైన విద్యార్థినితో పాఠశాల సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు మండల కేంద్రంలోని భద్రగిరి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని టి.టోలార్మి ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ బి.అరుణకుమారి సోమవారం తెలిపారు. విజయనగరం జిల్లాలోని విజ్జి స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్14 విభాగంలో టోలార్మి పాల్గొని, విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సదరు విద్యార్థినిని పాఠశాల సిబ్బంది సోమవారం అభినందించారు. రానున్న పోటీల్లోనూ సత్తా చాటి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉత్సవాలకు సహకరించండి



బందోబస్తుపై అభిప్రాయాలు సేకరిస్తున్న సీఐ ప్రసాద్

పాలకొండ రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంచేసేందుకు అన్ని వర్గాలూ పోలీసులకు సహకరించాలని సీఐ ఆమిటి ప్రసాద్ కోరారు. ఈ మేరకు కోటదుర్గమ్మ ఆలయ పరిసరాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన బందోబస్తుపై సమీక్షించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

శంకరరావుకు ఘననివాళి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చాపరాయిబిన్నిడి గ్రామంలో సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచ్ ఎం.శంకరరావు పదో వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు, గ్రామస్తులంతా పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు కొనియాడారు. గిరిజనుల కొండపోడు పట్టాలు, గిరిజన ప్రాంతాల్లో విద్యుత్, రవాణా సౌకర్యాల కోసం ఆయన అలుపెరుగని కృషి చేశారని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పి.అసిరయ్య, సీపీఎం నాయకుడు ఎం.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

17న వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

గరుగుబిల్లి: పార్వతీపురంలోని శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 17వ తేదీన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుందని, ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు హాజరుకానున్నారని, అందరూ రావాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కురుపాం: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండలంలోని పలు పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యులతో కలిసి సోమవారం పర్యటించారు. నిరసన వారంలో భాగంగా జిల్లా కేంద్రంలో బుధవారం ధర్నా చేస్తున్నామని, అందరూ వచ్చి మద్దతు పలకాలని కోరారు. అనంతరం కురుపాం తహసీల్దారు కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ భూదేవికి మెమొరాండం అందజేశారు.

ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
"నీ నోరు తెరచి న్యాయముగా తీర్పు తీర్చుము. దీనులకును, శ్రమపడువారికిని, దరిద్రులకును న్యాయము జరిగింపుము." సామెతలు 31:9
ప్రపంచ న్యాయ దినోత్సవం సందర్భంగా పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి వారికి, సహచర న్యాయవాద మిత్రులందరికీ ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
ఎమ్.శామ్యూల్, ఎమ్.ఏ., బి.ఎల్., న్యాయవాది
బార్ అసోసియేషన్ అధ్యక్షులు, పాలకొండ
నివాసం: సీతంపేట. సెల్: 9441158987

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com